# పారిశుధ్యం మెరుగుపై ఫోకస్ పెంచాలి : ఆర్.వి కర్ణన్

**-డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకూ అదనంగా**

**1458 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 547 నిర్మాణ వ్యర్థాల తరలింపు**

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుధ్యం మరింతగా మెరుగుపరచడానికి జోనల్, డిప్యూటీ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. శనివారం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై అదనపు కమిషనర్‌లు, జోనల్ కమిషనర్‌లు, ఇంజనీరింగ్, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కమిషనర్ వెబ్ ఎక్స్ దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు.జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేపట్టాలన్నారు.పారిశుధ్య కార్యక్రమాలతో పాటు పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్రనగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నారు.ఇప్పటి వరకూ 1458 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 547 నిర్మాణ వ్యర్థాల తరలింపు జరిగినట్లు వెల్లడించారు.తొలిరోజు ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ తోప్రారంభమైన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం గడిచిన ఆరు రోజుల్లో ఫ్లై ఓవర్లు ,రోడ్డు పక్కలు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్లు,చెరువులు, నాలాలు,ఫుట్‌పాత్‌లు, పార్కులు , నిర్మాణ- కూల్చివేత వ్యర్థాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు.జీహెచ్ఎంసీ పరిధి 300 వార్డులలోనీ మొత్తం 1204 ఏరియాలు,పాయింట్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్‌లు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌లు, పార్క్‌లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టగా, ఇప్పటి వరకు అదనంగా1458 మెట్రిక్ టన్నుల వ్య ర్థాలు, 547 నిర్మాణ వ్యర్థాల తరలింపు చేపట్టారు. డ్రైవ్‌లో భాగంగారోడ్డు ప్రక్కన సుదీర్ఘకాలంగా నుంచి ఉంచుతున్న పాడైపోయిన కార్లను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అమలును కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్‌లు , డిప్యూటీ కమిష నర్‌లు ఆకస్మికంగా తనిఖీ చేస్తూ క్షేత్ర స్థాయిలో ప్రభావవంతంగా అమల య్యేలా ప్రయత్నిస్తుండడం గమనార్హం.



హైదరాబాద్ వార్త

# ఆకట్టుకుంటున్న ఉద్యాన్ ఉత్సవ్



పూలను పరిశీలిస్తున్న సందర్శకులు



ఔషద మొక్కలకు సంబంధించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



**అల్వాల్, జనంరొ 3 ప్రభాతవార్త:** బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ ఉత్సవ్ ఆకట్టుకుంటోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ఉత్సవన్‌ను ప్రారంభించడం జరిగింది. జనవరి 3 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఉత్సవ్‌ను పౌరులు ఉదయం 10 గంటలు నుంచి రాత్రి 8 గంటలు వరకు సందర్శించే విధంగా ఏర్పాటు చేశారు. మొదటి రోజు శనివారం సందర్శకుల సంఖ్య స్వల్పంగా ఉంది. కేంద్ర వ్యవసాయ శాఖ సహకారంతో రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్సవ్‌ను నిర్వహిస్తోంది. ఆయా విభాగాలకు చెందిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆధునిక వ్యవసాయ నిర్వహణకు సంబంధించి మంత్రిత్వ శాఖకు చెందిన సిబ్బంది అవాగహన కల్పిస్తున్నారు. వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలు, ఉత్పత్తులకు చెందిన 120 ప్రదర్శకులుతో 50 స్టాళ్ళు ఏర్పాటు చేశారు. చిరు ధాన్యాలు మిల్లెట్ మండి, స్టార్టప్ హబ్, సేంద్రీయ ఉత్పత్తులు, హస్తకళల ప్రదర్శనలు, ఏకో బజార్‌లు నుంచి ప్రజానీకం కొనుగోలు చేస్తున్నారు. చామంతి, సోలోసియా, బంతిపూలుతో చేసిన ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భరతనాట్యం, కూచిపూడి, బొగ్గుడోలు, సంగీత కచేరీలు, హరికథ, బుర్రకథ, శాస్త్రీయ నృత్యాలు జరుగుతున్నాయి. కుండలు తయారీ, కూరగాయలుపై చెక్కడాలు, విత్తన బంతులు తయారీ వంటి వాటిపై యువతకు అవగాహన కల్పిస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పరిధిలోని హైడ్రోపోనిక్స్, ఆక్వాపోనిక్స్, సహజ రంగులు తయారీ విధానం తదితర అంశాలను ప్రత్యక్షంగా తిలకించే అవకాశం ఉంది.

# మోక్షం ఎప్పుడో..!

**-ప్రభుత్వ పిలుపు కోసం లాయర్ల ఎదురుచూపు**

**-ఎంపికై ఏడాది గడుస్తున్నా**

**న్యాయశాఖలోనే ఫైల్**

**హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త:**
జీహెచ్ఎంసీలో విధులు నిర్వహించేందుకు వివిధ సర్కిళ్లకు న్యాయవాదులను ఎంపిక చేసి ఏడాది పూర్తవుతున్నా ఆయా న్యాయవాదులకు ఇంకా ఉత్తర్వులు అందలేదు. 2024 డిసెంబర్ లో అడ్వకేట్ జనరల్ ఆఫీస్ నుంచి జిహెచ్ఎంసి పరిధిలోని సర్కిళ్లలో లీగల్ స్టాండింగ్ కమిటీలో 16 సర్కిళ్లలో విధులు నిర్వహించటానికి న్యాయవాదులు కావలని ప్రకటన చేశారు. డిసెంబర్ 30 వ తేదీ లోపు ధరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దీంతో దాదాపు 300 మంది న్యాయవాదులు ధరఖాస్తు చేసుకున్నారు. వారి ధరఖాస్తులను పరిశీలించిన తరువాత 2025జనవరిలో 16 మంది న్యాయవాదులను ఎంపిక చేసారు. అనంతరం పోలీస్ ధృవీకరణతో పాటు సర్టిఫికేట్ వెరిఫికేషన్ సైతం పూర్తి చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే అఫైల్ వెళ్ళి దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. దీంతో న్యాయవాదులు ఫైల్ న్యాయ శాఖలో మూలన పడి ఉందని ఈ ఫైలు బయటికి రాకుండా కొన్ని రాజకీయ దుష్ట శక్తులు అడ్డుపడుతున్నాయి ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జిహెచ్ ఎంసిలోని ఓఉన్నతాధికారిని ప్రశ్నించగా అడ్వకేట్లను ఎంపిక చేసిన మాట వాస్తవమేనని తాము ఎంపిక చేసిన జాబితాను ప్రభుత్వానికి పంపామని అక్కడి నుంచి ఉత్తర్వులు వచ్చేవరకు వేచిచూడాలని తెలిపారు.

# గచ్చిబౌలి రహదారిపై జింక పరుగులు...ఢీకొట్టిన కారు

**గాయపడిన జింక వన్యప్రాణి**

**సంరక్షణ కేంద్రానికి తరలింపు**

**గచ్చిబౌలి, జనవరి 3 ప్రభాతవార్త**
ఐటి కారిడార్ రహదారిపై వన్యప్రాణి పరుగులు పెట్టింది. హెచ్‌సియు ఆటవీ ప్రాంతం నుంచి దారితప్పి రోడ్డు మీదకు వచ్చిన జింక వాహనాల రణగోణధ్వనుల మధ్య భయంతో రోడ్డుపై పరుగెత్తింది. ఈ క్రమంలో రోడ్డు మీవ వస్తున్న ఓ కారు జింకను ఢీకొట్టడంతో మూగజీవం గాయపడింది. ప్రయాణికుల సమాచారంతో గాయపడిన జింకను వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన ఓ జింక శనివారం మధ్యాహ్నం లింగంపల్లి ఆలిండ్ కంపెనీ సమీపంలోని



గచ్చిబౌలి-లింగంపల్లి రహదారిపై పరుగులు పెడుతున్న జింక

రహదారి మీదకు వచ్చింది. రోడ్డు మీద పరుగులు పెడుతున్న జింకను అటుగా వచ్చిన కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. గాయపడిన జింక రోడ్డు పక్కన ఉన్న చెట్లలోకి చేరగా ప్రయాణికులు హెచ్‌సియు యానిమల్ ప్రొటెక్షన్ టీమ్‌కు సమాచారం అందించారు. దీంతో వారు సం



గాయపడిన జింకను వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్న ద ృశ్యం

ఘటనా స్థలికి చేరుకొని గాయపడిన జింకను వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించారు. కాగా సంరక్షణ కేంద్రానికి తరలించే సమయంలోనే జింక మృతి చెందినట్లు తెలుస్తుంది. ఆటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన జింక ఆనుకోని ప్రమాదంలో మ ృత్యువాత పడడంపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

# నుమాయిష్‌కు సందర్శకుల తాకిడి

**-6న నుమాయిష్ మహిళా దినోత్సవం**

**-ఫిబ్రవరి 15వ వరకు ఎగ్జిబిషన్ సందర్శన**

**గోషమహల్,జనవరి 3 ప్రభాతవార్త:**
విద్యుత్ కాంతుల వెలుగు జిలుగులు....కళ్ల చెదిరే ఇంటీరియర్ డెకరేషన్...భారీ పరిశ్రమలుమొదలుకొనికుటీర పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన....ప్రత్యేక ఆకర్షణగా నిలిచే హస్తకళా రూపాలు. .అలరించే చుక్‌చుక్ రైలు....గాలిలో తేలిపోయే అనుభూతిని కలిగించే రంగుల రాట్నం..నోరూరించే తినుబండారాలు....తదితర అన్ని హంగులతో నడుస్తున్న'ననుమాయిష్' సందర్శకులు విశేషంగా అలరించనున్నది.85వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శలో సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటుంది. నగర ఖ్యాతిని విదేశాలకు సైతం వ్యాప్తి చేస్తుంది. ఇతర ప్రాంతాలనుంచి తరలివచ్చే సందర్శకులు ఎగ్జిబిషన్‌ను తిలకించి ఆనందాన్ని పొందుతున్నారు .ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిన నేటి తరుణంలో 85వ నుమాయిష్ ప్రదర్శన సందర్శకులకు ప్రతియేటా ఫిబ్రవరి15వతేదిన వరకు కొనసాగే ఎగ్జిబిషన్ ప్రైవేట్ సంస్థలతోపాటు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన స్టాళ్లు కూడా ఎంతో వినియోగదారులను ఆదరణను చూరగొంటున్నాయి.ఈనెల



6వ తేదిన నుమాయిష్‌లో మహిళా దినోత్సవం పేరిట కేవలం మహిళలే సందర్శకులకు మాత్రమే అనుమంతి ఇస్తారు.45రోజుల పాటు శని,ఆదివారాలల్లో సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకు,అనుమతి,సాధారణ రోజులల్లో సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10గంటల 30 నిమిషాల వరకు కొనసాగుతుందన్నారు.గత ఐదు సంవత్సరాల నుంచి నుమాయిష్‌ను తిలకించేందుకుగాను వచ్చేసందర్శకల నుంచి 50 రూపాయల టిక్కెట్ పేరిట వసూలు చేస్తున్నారు.ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకుగాను సందర్శకుల నుంచి వసూలు చేయడం జరుగుతుంది.జనవరి 31వ తేదిన పాఠశాల విద్యార్థులకుఉచితంగా తిలకించేందకుగాను అనుమతి ఇస్తారు.మెడికల్ క్యాంపు,కవి సమ్మేళనం,పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.

# అంబేద్కర్ వర్సిటీలో జాతీయ సదస్సులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య ఘంటా చక్రపాణి తదితరులు.

**జూబ్లీహిల్స్, జనవరి 3, ప్రభాతవార్తః**
డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం అధ్వర్యంలో నిర్వహించనున్న సుస్థిర అభివృద్ధి కోసం వ్యాపార పరివర్తన అనే రెండు రోజుల జాతీయ సదస్సు బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఘంటా చక్రపాణి శనివారం వర్సిటీ ఆవరణలో ఆవిష్కరించారు. మార్చి 13, 14 తేదీలలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో సుస్థిరత కోసం డిజిటల్ పరివర్తన, ఫిన్‌టెక్, సస్టైనబుల్ ఫైనాన్స్, డిజిటల్ మార్కెటింగ్, సస్టైనబుల్ రిటైలింగ్, సరఫరా గొలుసు కార్యకలాపాలు, సస్టైనబుల్ మానవ మూలధనం న్యాయకత్వం, సస్టైనబుల్ హెల్త్‌కేర్ సేవలు, సస్టైనబుల్ వ్యాపార నమూనాలు అనే అంశాలపై సదస్సులో చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ఆచార్య పుష్పా చక్రపాణి; రిజిస్ట్రార్, డా. ఎల్. విజయా కృష్ణా రెడ్డి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగ డీన్ ఆచార్య ఆనంద్ పవార్, ఆచార్య రబింద్రనాథ్ సోలమన్, డా. రాధాకృష్ణ, డా. బర్ల శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటికను వ్యతిరేకిస్తూ ధర్నా



బోరబండ సైట్2లో శ్మశాన వాటిక నిర్మించవద్దంటూ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న సాయిబాబానగర్ వాసులు.

**యూసుఫ్‌గూడ, జనవరి 3, ప్రభాతవార్త :**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ సైట్2లో శ్మశాన వాటిక ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. ఆ స్థలానికి ఆనుకుని చుట్టుపక్కల బస్తీలలో నివాసితులు అక్కడ శ్మశాన వాటిక ఏర్పాటు చేయవద్దంటూ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కబరస్తాన్ కోసం నియోజకవర్గంలోని మైనారిటీలకు స్థలం కేటాయిస్తున్నట్లు ప్రకటించటంతో సాయిబాబానగర్ బస్తీవాసులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై జల్లా కలెక్టర్‌కు ఆర్డీవోకు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించటం జరిగింది. అధికారుల నుంచి ఎలాంటి స్పందన కారకపోవడంతో శనివారం పెద్దఎత్తున బస్తీ వాసులు స్థానికులు సాయిబాబానగర్ నుంచి సైట్2 మీదుగా బోరబండ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. జన నివాసాల మధ్య శ్మశాన వాటికను(గ్రేవ్ యార్డ్‌ను) వ్యతిరేకిస్తున్నామంటూ ప్లకార్డులతో శాంతియుతంగా ధర్నా నిర్వహించారు .అక్కడ ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బోరబండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తమకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం కొనసాగిస్తామంటూ బస్తీ వాసులు పేర్కొన్నారు.

## సీనియర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు జోన్ల పర్యవేక్షణ బాధ్యత

**ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ ఆర్‌వి కర్ణన్**

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసీ పరిధి విస్తరించి 12 జోన్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో, పట్టణ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకుజోన్లకు పర్యవేక్షణ అధికారులుగా సీనియర్ టౌన్ ప్లానింగ్ అధికారులను నియమిస్తూ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఫలితంగా క్షేత్రస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులకు మార్గదర్శనం తో పాటు సమస్యలకు వేగవంతమైన పరిష్కారం, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ బలోపేతం కానుంది.సిపిపి కె.శ్రీనివాస్‌కు శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్‌లను అప్పజెప్పగా..డైరెక్టర్ బి.వెంకన్నకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మరోడైరెక్టర్ ప్రదీప్‌కుమార్‌కు మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్‌లను అప్పగించారు.

## 3 వేల గజాల పార్కు స్థలాలను కాపాడిన హైడ్రా

**రూ. 35 కోట్ల విలువైన స్థలాల చుట్టూ ఫెన్సింగ్**

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**
కూకట్‌పల్లి పరిధిలోని 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కులను హైడ్రా శనివారం కాపాడింది. ఇలా కాపాడిన భూమి విలువ రూ. 35 కోట్ల వరకూ ఉంటుంది. భాగ్యనగర్ ఫేజ్-3 కాలనీలో రెండు పార్కులు కబ్జాకు గరయ్యాయని హైడ్రా ప్రజావాణికి అక్కడి నివాసితుల సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు వివిధ శాఖలతో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే నంబరు 197తో పాటు 200లలో 36 ఎకరాలలో భాగ్యనగర్ ఫేజ్ 3 పేరిట హుడా అనుమతి పొందిన లే ఔట్ 1987లో ఏర్పడింది. 357 ప్లాట్లతో ఏర్పడిన ఈ కాలనీలో రెండు పార్కులు ఆక్రమణకు గురయినట్టు గుర్తించారు. 2 వేల గజాల పార్కులో సగం వరకూ కబ్జా అవ్వగా.. ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కులో వెయ్యి గజాల వరకూ ఆక్రమణకు గురైనట్టు పేర్కొంటూ నివేదిక సమర్పించారు. ఈ నివేదిక మేరకు హైడ్రా కమిషనర్ ఆదేశాలతో శనివారం ఈ ఆక్రమణలను అధికారులు తొలగించారు. రెండు పార్కుల చుట్టూ ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రాణవాయువును అందించే పార్కులను కాపాడిన హైడ్రాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## సినీ నటుడి కుమారుడినంటూ నమ్మించి మోసగించాడు

**- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో రూ.7.10 లక్షల మోసం**

**జూబ్లీహిల్స్, జనవరి 3, ప్రభాతవార్తః** నటుడి కుమారుడినంటూ నమ్మించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడిన ఒకరిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రెండేళ్ల క్రితం వెడ్డింగ్ ప్లానర్‌గా పనిచేసే వెంకటసుబ్బారావుకు తన స్నేహితుడి ద్వారా బంజారాహిల్స్‌లో నివసించే బోగి రెడ్డి శరత్ రెడ్డి(33) పరిచయమయ్యాడు. శరత్ రెడ్డి తన తండ్రి సినీ నటుడని, తాను జాబ్ కన్సల్టెంట్‌గా పనిచేస్తూ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించాడు. ఆ మాటలను నమ్మిన వెంకటసుబ్బారావుతోపాటు అతని స్నేహితులైన ఈశ్వర్ నాయక్, నవీన్, లోకేష్ మద్రిపల్లి, త్రివేణి ఉద్యోగాల కోసం రూ.7,10,000 చెల్లించారు. డబ్బులు తీసుకున్న అనంతరం శరత్ రెడ్డి మాయమాటలు చెప్పడమే కాకుండా డబ్బులు అడిగితే దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగాడు. తండ్రి పేరు చెప్పి బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికితోడు శరత్ రెడ్డి మొబైల్ నంబర్లు, నివాస స్థలాన్ని మార్చి పరారయ్యాడు. దీంతో వెంకటసుబ్బారావుతోపాటు ఇతర బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొత్త సర్కిల్ కార్యాలయాలలో కనీస వసతుల కొరత

**- సర్ధుకోని విభాగాలు - పూర్తిగా లేని ఉద్యోగులు - గందరగోళంగా డివిజన్లు**

**చాంద్రాయణగుట్ట, జనవరి 3 ప్రభాతవార్త :** జీహెచ్ఎంసి పునర్విభజన తరువా త ఏర్పడిన సర్కిల్ కార్యాలయాలలో కనీస వసతులు కరువైయ్యాయి. కనీసం కూర్చోవటానికి సీటు, తాగటానికి నీరు కూడా లేని పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో వివిధ విభాగాలకు గదుల కేటాయింపుపై తర్జభర్జనలు జరుగుతున్నాయి. సర్కిల్ కార్యాలయంలో ఉండాల్సిన వివిధ విభాగాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. ఇంజనీరింగ్, పారిశుధ్య నిర్వాహణకు ఈఈ, డిఈ స్థాయి అధికారులు వచ్చినా ఇంకే అనేక విభాగాలకు సిబ్బంది కేటాయింపు జరగాల్సి ఉంది. సిబ్బంది సర్దుబాటుతో పనులు జరుగుతున్నాయి. ఇక కొన్ని డివిజన్ల పేర్లపై సిబ్బంది అయోమయంలో ఉన్నారు. గజిట్‌లో ఒకటి, మహా కమిషనర్ జాబితాలో మరొక పేర్లతో డివిజన్ల పేర్లు గందరగోళంగా ఉన్నాయి. ఇటీవల జరిగిన పునర్విభజనలో చార్మినార్ జోన్‌ను విడదీసి కొన్ని డివిజన్లతో కొత్త సర్కిళ్లు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ జోన్‌లో చాంద్రాయణగుట్ట సర్కిల్‌లోని జంగమ్మెట్ డివిజన్ పేరుతో కొత్త సర్కిల్ ఏర్పాటైయ్యింది. ఆ సర్కిల్‌లో ఉన్న రియాసత్‌నగర్, లలితాబాగ్, జంగమ్మెట్, ఫూల్‌బాగ్ (కొత్తది), ఖాద్రిచమన్ (కొత్తది) డివిజన్లను జంగమ్మెట్ సర్కిల్లోకి మార్చారు. ఈ విధంగా కొత్తగా ఏర్పాటైన జంగమ్మెట్ సర్కిల్ కార్యాలయాన్ని జంగమ్మెట్ వార్డు కార్యాలయం పక్కన కొత్తగా



బోర్డు లేని జీహెచ్ఎంసి జంగమ్మెట్ సర్కిల్ కార్యాలయం

నిర్మించిన జీ+1 భవనంలో ఏర్పాటు చేశారు. కనీసం జంగమ్మెట్ సర్కిల్ కార్యాలయం పేరుతో బోర్డు పెట్టలేదు. ఈ భవనంలో ఇంకా పనులు కొనసాగుతున్నాయి. మొదటి అంతస్థులోని గదుల ఫ్లోరింగ్ పూర్తి కాలేదు. దిగువన ప్రహారీ ప్లాస్టింగ్ పనులు నడుస్తున్నాయి. ఫ్లోరింగ్ చేయలేదు. ఇతర అవసరాల కోసం నిర్మించిన భనంలో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కావటంతో అందులోని గదులు సరిపోవటం లేదు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగం వార్డు కార్యాలయంలో కొనసాగుతుంది. పూర్తిస్థాయిలో ఫర్నీచర్, కంప్యూటర్లు, రికార్డులు రాలేదు. ఒక సర్కిల్లో ప్రధానంగా డిసి, ఎఎంసి, ఈఈ (ఇంజనీరింగ్), టౌన్ ప్లానింగ్, ఎఎంఓహెచ్, ఎలక్ట్రికల్, జనన మరణ, ఆరోగ్యం పారిశుధ్యం, వెటర్నరీ, యుసిడి, యుబిడి, మలేరియా, ట్యాక్స్, ఫుడ్ సేఫ్టీ, ఎన్నికల విభాగం తదితరాలుంటాయి. జీ+1 లో ఉన్న పదిలోపు గదులలో ఇన్ని విభాగాలు,



విభాగాల ఏర్పాటుకై సిబ్బందితో చర్చిస్తున్న డీసీ నాగమణి

అధికారులు, సిబ్బంది పనిచేయాల్సి ఉంది. ఇవి అన్ని సర్దు కోవటానికి, జనాలకు ఏ విభాగం ఎక్కడ ఉందో తెలుసుకొవటానికి సమయం పట్టేలా ఉంది. ఆఘమేఘాల మీదు ఏర్పాటైన సర్కిల్ కార్యాలయం అర్థమైయ్యేందుకు కొంత ఓపిక పట్టక తప్పదు.

**డివిజన్ల పేర్లపై గందరగోళం....**

సర్కిల్‌కు కేటాయించిన కొన్ని డివిజన్లపై సిబ్బందిలో గందరగోళం నెలకొంది. ప్రధానంగా ఎన్నికల సిబ్బంది, బిఎల్ఓలు అయోమయానికి గురియవుతున్నారు. గజిట్‌లో ఒకటి, కమిషనర్ ఉత్తర్వులలో మరొక పేరుతో భిన్నంగా ఉన్నాయి. ఖాద్రిచమన్-కందికల్‌గేట్‌గా, లలితాబాగ్-ఈదిబజార్‌గా, ఫూల్‌బాగ్ - ఉప్పుగూడగా ఇలా సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నాయి. వారు విషయాన్ని డీసీ దృష్టికి తీసుకువస్తున్నారు. కమిషనర్ ఆదేశాల ప్రకారమే నడుచుకోవాలని డీసీ సలహా ఇస్తున్నారు. మహానగర పాలక సంస్థ విడిపోయి కొత్తగా మరికొన్ని కార్పోరేషన్లు ఏర్పాటైతే డివిజన్ల పేర్లు సర్ధుకుంటాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సావిత్రిబాయి పూలే సేవలు ఎంతో గొప్పవి : బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి జనవరి 3, ప్రభాతవార్త :** భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, సామాజిక సంస్కర్తగా సావిత్రిబాయి ఫూలే చేసిన సేవలు ఎంతో గొప్పవని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ముఖ్యంగా మహిళా విద్య , సాధికారత కోసం ఆమె పడ్డ కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శనివారం రాంనగర్‌లో సావిత్రిబాయి ఫూలే 195వ జయంతి వేడుకలు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిదిగ పాల్గొన్న బండారు దత్తాత్రేయ సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి, కార్పొరేటర్లు పావని వినయ్ కుమార్, వై. అమృత, పవని వినయ్ కుమార్, సుప్రియ నవీన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, కొంతం దీపిక నరేష్, కెతినేని సరళ, జిహెచ్ఎంసీ మాజీ మేయర్ బండా కార్తిక చంద్రమ్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి. ఆనంద్ గౌడ్,



ప్రసంగిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి, అడిక్ మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, ఇతర ప్రముఖ నాయకులు, కా ర్యకర్తలు పాల్గొన్నారు. ఆమె ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

## ఇంటర్ స్కూల్ బాలికల కబడ్డి టోర్నమెంట్ విజేత శ్లోకా స్కూల్



విద్యార్థినులకు మెమెంటో ట్రోఫి అందచేసిన నిర్వాహకులు

**బేగంబజార్, జనవరి 3 ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిరావు, సావిత్రి జ్యోతిరావు పూలే సమాజ శ్రేయస్సు, చైతన్యం కోసం ఎంతో కృషి చేసినట్లు కుల్సుంపురా ఎస్.ఐ శ్వేతా అన్నారు. మహాత్మాజ్యోతి రావు పూలే యువ మంచ్, శ్లోక్లా హైస్కూళ్ల సంయుక్త ఆద్వర్యంలో దేశంలోనే మొట్ట, మొదటి మహిళాఉపాధ్యాయురాలు సామాజికి ఉద్యమకారిణి సావిత్ర బాయిపూల్ 195 జయంతి ఉత్సవాలల్లో భాగంగా రెండు రోజుల పాటు ఇంటర్ స్కూల్ బాలికల కబడ్డి టోర్నమెంట్ పోటిలు నిర్వహించారు. జియాగూడలోని శ్లోకా స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన కబడ్డి పోటిలల్లో హైదరాబాద్ జిల్లాలోని 10 హైస్కూళ్లకు చెందిన బాలికల కబడ్డి క్రీడాకారుల జట్లు తరలి వచ్చి పోటిలలో పాల్గొన్నారు. శ్లోక్లా స్కూల్ కబడ్డి జట్టు, కృష్ణవేణి కబడ్డి జట్టుపై విజయం సాధించారు. ఎస్.ఐ శ్వేతా, మహాత్మాజ్యోతిరావు పూలే యువమంచ్ అధ్యక్షులు కె.ఎమ్. గురుచరణ్‌లు విజేత జట్టుకు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో శ్లోకా ప్రిన్సిపల్ ఎం. నాగేష్, రాష్ట్ర యువజన అధ్యక్షులు జి. నరేష్, పి. మహేందర్, ప్రతినిధులు వి. శివచరణ్, మాగి ప్రభాకర్, పిటి ఉపాధ్యాయులు సుక్పాల్‌సింగ్, విద్యార్దులు తదిరతరు లు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి తమ వంతు కృషి : ఎమ్మెల్యే


కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాదవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకంక్షలు తెలుపుతున్న గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు

**యూసుఫ్‌గూడ, జనవరి3, ప్రభాతవార్త :** బస్తీల కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తగిన విధంగా నిధులు కేటాయించి అభివృద్ధిపనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. శనివారం గాయిత్రినగర్ డివిజన్ నుంచి గాయిత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు ఆధ్వర్యంలో సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్, సంజీవరెడ్డి, కాశీనాథ్ చారి, జితేందర్, శ్రీలత పాల్గొన్నారు.

## భూ సమస్యను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తాం


కార్మికనగర్ భూ సమస్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను కలిసి రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.

**యూసుఫ్‌గూడ, జనవరి3, ప్రభాతవార్త :** ఎన్నో దశాబ్దాలుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్ డివిజన్ కళ్యాణ్‌నగర్ సొసైటీ కార్మికనగర్ బస్తీ భూ వివాదం ఎథావిధిగానే ఉంది. పలు మార్లు గతంలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్ళినప్పటికి ఏమాత్రం పరిష్కారం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నేతృత్వంలో పలు మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను బస్తీ వాసులతో కలిసి భూ వివాదాన్ని వివరించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరించి స్థానికులకు న్యాయం చేయాలని కమినర్‌కు విన్నవించారు. బాధితుల వినతులను స్వీకరించిన కమిషనర్ నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవి, వినోద్‌కుమార్ గౌడ్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మన పరిసరాలు, మన ఇళ్లు పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారానే ఆరోగ్య సమాజం సాధ్యమవుతుందని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. శనివారం కాచిగూడలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్క్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కన్నా ఉమారమేష్ యాదవ్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలను శుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటి మున్సిపల్ కమీషనర్ మారుతి దివాకర్, డిఈఈ రఘు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాతబస్తీ నుంచి మౌలాలీ వరకు షియా ముస్లింల ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, షీరత్-ఇ-జెహ్రారా కమిటీ ప్రతినిధులు

**చార్మినార్, జనవరి 1 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో శనివారం హజ్రత్ అలీ జయంతి సందర్భంగా షీరత్-ఇ- జెహ్రారా కమిటి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బిజెపి మాజీ ఆధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అలీజాకోట్ల వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్రత్ అలీ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలీజాకోట్ల నుంచి ప్రారంభమైన ఊరేగింపు మీరాలంమండి, పురానీహవేలీ, దారుషిఫా, ఛాదర్‌ఘాట్, బర్కత్‌పుర, నల్లకుంట, తార్నాక ప్రాంతాలు మీదుగా మౌలాలీ పహడ్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమం షీరత్-ఇ-జెహ్రారా కమిటి చైర్మన్ అలీ రజా, మౌలానా సయ్యద్ లుఖ్మాన్ హుస్సేన్ మూస్వీ, సయ్యద్ అబ్బాస్‌అలీ, సయిద్, నవాబ్ అలీ పాల్గొన్నారు.


కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ ప్రాంగణంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు



సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయురాలు పార్వతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


దారుల్ ఉల్ ఉలూమ్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు


సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్


అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణంలో సావిత్రి భాయి పూలే జయంతి సభలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ కేసి రెడ్డి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పద్మజ


సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బిసి, ఎస్సీ, ఎస్టీ చైతన్య వేదిక ప్రతినిధులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో నిర్వహించిన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి ఇతర ఆచార్యులు, ఉద్యోగులు.


జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్ మహనీయుల కూడలిలో ఉన్న సావిత్రీ భాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తదితరులు.


సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జీడిమెట్ల డిపో టీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు


సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నేతలు శ్యాం, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు

# సావిత్రీబాయి పూలేకు ఘన నివాళులు

## బంజారాల సమగ్రాభివృద్ధికి దేశ వ్యాప్తంగా 'బంజారా భారథ్ ప్రచార రథయాత్ర'



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్. రవీంద్రనాయక్

**సైఫాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** బంజారా గిరిజనుల సమగ్రాభివృద్ధి, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా త్వరలో 'బంజారా భారథ్ ప్రచార రథయాత్ర' నిర్వహిస్తున్నామని బంజారా భారత్ వ్యవస్థాపక ఛైర్మన్ మాజీ ఎంపి ఎస్. రవీంద్రనాయక్ తెలిపారు. బంజారా గిరిజనుల గుర్తింపు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాల ముగింపు సంబురాలు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లుకు సన్మానం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన నూతన సంవత్సరం బంజారా భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జున్ సాగర్ ముంపు తండాలు, గ్రామాలు నుంచి పునర్వాసం పొందిన ప్రజలకు ప్రసుత్తం గుంటూరు జిల్లాలో ఎదుర్కొంటున్న జీవన సమస్యలు పరిష్కారానికి సాగరహర కార్యక్రమం చేపడతామన్నారు. మైదాన ప్రాంతాల్లో అత్యధికంగా బంజారా గిరిజనులకు చట్ట సభలలో పోటి చేసేందుకు రిజర్వేషన్‌లు కల్పించాలని రిజర్వేషన్‌లు అదనంగా కేటాయించాలని, రాష్ట్రంలో పటిష్టంగా ఎస్టీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని ఆయన కోరారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అండ్ కో దోచుకున్నదని ఈ అవినీతిపై సిఎం రేవంత్‌రెడ్డి సమగ్రంగా విచారణ జరిపి వారిని శిక్షించాలని, వారి ఆస్తులను జప్తు చేయాలని ఆయన కోరారు. ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత చేస్తున్న ఆరోపణలపైన కూడా సిఎం విచారణ జరపాలని, ఆమె అప్రువల్‌గా మారి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.

## స్టడీటూర్ పేరుతో కోట్లాదిరూపాయల ప్రజాధనం వృధా : నవతారెడ్డి

**శేరిలింగంపల్లి, జనవరి 3 పభాతవార్త** స్టడీటూర్లపేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తూ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు విహార యాత్రలు చేయటం దారుణమని బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి నియోజక వర్గ నేత, చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రోడ్డు, డ్రైనేజీలు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిచ డబ్బులతో విహార యాత్రలు చేయటం సిగ్గుచేటని ఆమె విరుచుకుపడ్డారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల పదవీకాలం ఫిబ్రవరి 10వ తేదితో ముగుస్తుండటంతో జీహెచ్‌ఎంసీ స్టడీటూర్‌పేరుతో విహార యాత్రలను నిర్వహించటాన్ని మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ నియోజక వర్గ నాయకురాలు బొబ్బ నవతారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల 35 రోజుల పదవీ కాలం ఉండగా స్టడీ టూర్ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని, దానివల్ల ఉపయోగం ఏమిటని ఆమె ప్రశ్నించారు. స్టడీటూర్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుబారా చేస్తూ విహార యాత్రలు చేయటం సిగ్గుచేటన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో ఇలాంటి దుబారా ఖర్చులను అనుమతించలేదన్నారు. 35రోజుల్లో ముగిసే పదవీకాలంలో టూరు ముగించుకుని వచ్చి ప్రజలకు చేసేది ఏముందన్నారు.

ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బుతో విహార యాత్రలు చేస్తూ, రోడ్డు, డ్రైనేజీలు లేక ఇబ్బందులకు గురవుతున్న ప్రజల సమస్యలను గాలికి వదలివేయటంపై బీఆర్‌ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలని అపర్ణ హిల్‌పార్క్ వాసుల వినతి



మియాపూర్ సర్కిల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న అపర్ణహిల్‌పార్క్ వాసులు

**శేరిలింగంపల్లి, జనవరి 3 ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని అపర్ణ హిల్ పార్క్ రెసిడెన్సీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మియాపూర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ శశిరేఖకు వినతి పత్రాన్ని అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ సర్కిల్‌లోని అపర్ణ హిల్ పార్క్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో తమ కాలనీలో రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అపర్ణ హిల్‌పార్క్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కాలనీలను కలుపుతూ ఉన్న రోడ్డు నిర్మాణ పనులకు నిదులు కేటాయించినా, ఎమ్మెల్యే గాంధీ పనులు ప్రారంభించినప్పటికీ పనులు ఇప్పటి వరకు పూర్తికాకపోవడంపై కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మియాపూర్ సర్కిల్ కమిషనర్ శశిరేఖకు కాలనీ వాసులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. మియాపూర్ సర్కిల్‌లోని అపర్ణ హిల్‌పార్క్ నుంచి జనప్రియ కాలనీ వరకు గల పలు కాలనీల్లో రహదారులు అద్వాన్నంగా ఉన్నాయని, గతంలో ఎమ్మెల్యే గాంధీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినప్పటికి ఫలితం లేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి తమ కాలనీలోని రోడ్ల పనులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

## ఐఐఎంఆర్‌తో హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఒప్పందం

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త** పోషకాల భద్రతను బలోపేతం చేయడం, స్థిరమైన ఆహార వ్యవస్థలను ప్రోత్సహించడమే లక్ష్యంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సహకారం ద్వారా పరిజ్ఞానం బదిలీ, వంటకాల అభివృద్ధి, శిక్షణా కార్యక్ర మాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా చిరుధాన్యాల (మిల్లెట్స్) ఆధారిత ఆహార కార్యక్రమాలను విస్తృతంగా ప్రోత్సహించనున్నారు. శనివారం కోకాపేట్‌లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు అక్షయ పాత్ర ఫౌండేషన్ (తెలంగాణ ఆంధ్రప్రదేశ్) ప్రాంతీయ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, సి. తారా సత్యవతి డైరెక్టర్, ఐసీఏఆర్ కౌంతేయ దాస ప్రభూజీ తో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యగౌర చంద్ర దాస మాట్లాడుతూ... చిరుధాన్యాల ఆధారిత పోషకా హారాన్ని ప్రోత్సహించడంలోఐఐఎంఆర్‌తో కలిసి పనిచే యడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. చిరుధాన్యాలు భారతీయ సంప్రదాయ ఆహార సంస్కృతిలో కీలక భాగమే కాకుండా, ఆరోగ్యం, స్థిరత్వం, ఆహార భద్రత వంటి నేటి సవాళ్లను ఎదుర్కోవడానికి అత్యంత అవసరం. ఈ సహకారం ద్వారా మా ఆహార కార్యక్రమాల్లో చిరుధాన్యాలను వినూత్నంగా సమ్మిళితం చేసి సమాజా నికి మరింత మేలు చేకూర్చగలమని విశ్వసిస్తున్నాము" అని తెలిపారు. డా సి. తారా సత్యవతి మాట్లాడుతూ హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్‌తో సహకారం మిల్లెట్ పరిశోధనను విస్తృత స్థాయి సామా జిక ప్రయోజనాలుగా మార్చే దిశగా సమయోచితమైన, అర్థవంతమైన అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## డ్రగ్‌ఫ్రీ హైదరాబాద్ 5కె ఫ్యామిలీ రన్ పోస్టర్ ఆవిష్కరణ



నిర్వాహకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు డీసీపీ హనుమంతరావు.

**జూబ్లీహిల్స్, జనవరి 3, ప్రభాతవార్తః** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డ్రగ్‌ఫ్రీ హైదరాబాద్ కోసం 5కె ఫ్యామిలీ రన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఎక్సెలెన్షియా జూనియర్ కాలేజ్, ది క్వాంటమ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి అదనపు డీసీపీ జి. హనుమంతరావు ఆవిష్కరించారు. డ్రగ్‌ఫ్రీ హైదరాబాద్ కోసం నిర్వహించే ఈ 5కె ఫ్యామిలీ రన్ కార్యక్రమం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనవరి 11న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమం ఫిట్ హైదరాబాద్ - నీగి ఇండియా స్ఫూర్తితో నిర్వహించబడుతోందన్నారు. కార్యక్రమంలో ఎక్సెలెన్షియా జూనియర్ కళాశాల, క్వాంటమ్ స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లను సైబరాబాద్ కార్పొరేషన్‌లో ఉంచాలి

-ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరినప్పటినుండి నియోజకవర్గానికి నష్టాలే
-నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ పటోళ్ల కార్తీక్ రెడ్డి



**అత్తాపూర్ జనవరి3, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలిపే ప్రయత్నానని విరమించుకోవాలని , రాజేంద్రనగర్, శంషాబాద్‌లను సైబారాబాద్ కార్పొరేషన్‌లో కలపాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జీ పటోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం పటోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఐదు డివిజన్లు ఉండేవి అన్నారు. నేడు వాటి 17 డివిజన్లుగా విభజించారని తెలిపారు. ఈ నియోజక వర్గం మొత్తం కూడ సైబరాబాద్ పరిధిలో ఉండేదన్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్‌ను నూతనంగా ఏర్పాటు చేసిన వార్డుల విభజనతో కొత్త ఏర్పాడిన శంషాబాద్. రాజేంద్రనగర్ జోన్లను గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోకి తేవడం భాదకరమన్నారు. తద్వారా ఒక రాకీయ వర్గం వారికి కట్టబెట్టినట్టు అవుతుందని దీంతో రాజేంద్రనగర్ అభివృద్ధికి ఆటంకం ఏర్పడనుందన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెలే ప్రకాశ్ గౌడ్ కూడ ప్రభుత్వంతో చర్చించి ఆ రెండు జోన్లను సైబరాబాద్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీస్ విభాగాన్ని కూడా సైబరాబాద్ పరిధిలోనే ఉండేలా ప్రకాశ్ గౌడ్ చర్యలు తీసుకోవాలన్నారు. బోర్డ విభజన, పోలీస్ విభాగాల విభజన అంతేకూడ ఒకే ప్రాంతంలోకి తేవడం వల్ల ఒకే చోట ఒకే అధికారితో సమస్యలను పరిష్కరించడానికి సులువుగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అధికార పార్టీలోకి చేరారంటే నియోజకవర్గం అభివృద్ధి పనులు వేగవంతం అవుతుందని అర్ధం కాని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అధికారా పార్టీలో చేరినప్పటి నుంచి నియోజకవర్గానికి అనేక నష్టలు ఎదురైతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి దర్మారెడ్డి, మైలార్దేవ్‌ప్లి డివిజన్ బీఆర్‌ఎస్ ఆధ్యక్షుడు వెంకటేష్ కురుమ, నాయకులు సదాల వెంకటరెడ్డి, జీవన్ దాస్, కొత్తరాజశేఖర్ రెడ్డి, రాజేష్ యాదవ్, సూర్యం, దుర్గేష్, గుమ్మడి కుమార్, లక్ష్మిరాజ్, ఏర్వ సరిత, రావుల జంగయ్య, సదానంద్, జహీరుద్దీన్, రాముయాదవ్, ముక్రంఖాన్, మన్నె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జెహెచ్‌పిఎస్‌లో వీడ్కోలు వేడుక


జేహెచ్‌పీఎస్ ఫ్యాషన్ షోలో గెలుపొందిన విద్యార్థులు.

**జూబ్లీహిల్స్, జనవరి 3, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)లో శనివారం పది, పన్నెండో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 9, 11 తరగతి విద్యార్థులు పది, పన్నెండు తరగతులు ముగించుకున్న విద్యార్థుల కోసం వివిధ సంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సీనియర్లు వారి భవిష్యత్ ప్రయత్నాలన్నింటిలో విజయం సాధించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫ్యాషన్ షోలో విద్యార్థులు వివిధ రకాల ఆకర్షణీయమైన దుస్తులు ధరించి ర్యాంప్ వాక్ చేసి అలరించారు. విద్యార్థులు విలువలకు కట్టుబడుతూ ముందుకు సాగాలని పాఠశాల డైరక్టర్ ఎం. వరలక్ష్మి అన్నారు. పది, పన్నెండు తరగతులు ముగిసిన విద్యార్థులు మంచి దిశను ఎందచుకోవాలని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ప్రిన్సిపల్ పి. కాంచనవల్లి సూచించారు. ఫ్యాషన్ షోలో భాగంగా మిస్టర్ జేహెచ్‌పీఎస్‌గా పదో తరగతికి చెందిన శ్రీకర్‌సాయిమీనన్, 12 తరగతి నుండి దక్ష్ లునియా ఎంపికవ్వగా, మిస్ జేహెచ్‌పీఎస్‌గా పదో తరగతికి చెందిన చల్ల గ్రీష్మ, 12 తరగతి నుండి ఎం. జస్మితలు ఎంపికయ్యా రు. కార్యక్రమంలో విద్యార్థులు వివిద కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో సంక్రాంతి రంగోలి పోటీలు

**చార్మినార్, జనవరి 3 ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలో సంక్రాంతి రంగోళీ ముగ్గుల పోటీలను నిర్వహించనున్నామని సాలార్‌జంగ్ మ్యూజియం కీపర్ డాక్టర్. ఆర్. బి. నాయక్ తెలిపారు. 12 నుంచి 20 సంవత్సరాలు వయస్సు గల మహిళలు ఒక గ్రూపు, 20 సంవత్సరాలు పై పడిన మహిళలు ఒక గ్రూపుగా రంగోళీ పోటీలను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రంగోళీ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నా మని, విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నామని ఆయన తెలిపారు.

## భక్తి ప్రపత్తులతో శివ ముక్కోటి పూజలు

**చాంద్రాయణగుట్ట, జనవరి 3 ప్రభాతవార్త :** ధనుర్మాసం, శివ ముక్కోటి పౌర్ణమిని పురస్కరించుకొని పాతబస్తీలోని శైవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన చారిత్రక శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్నమల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు అలంకరణ, అభిషేక పూజలు నిర్వహించారు. సమీప బస్తీలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని పూజించారు. ఛత్రినాక శివగంగానగర్ శ్రీ లక్ష్మణేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ నేత కె. వెంకటేష్, ఆలయ చైర్మన్ మారెడ్డి దామోదర్‌రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొని శివలింగానికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## త్వరలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యవర్గం ప్రకటిస్తాం

### : డిసిసి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా

**చార్మినార్, జనవరి 3 ప్రభాతవార్త :** ఆన్‌లైన్ ధరఖాస్తుల పరిశీలన అనంతరం త్వరలో హైదరాబాద్ జిల్లాకాంగ్రెస్ కమిటి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్‌సైపుల్లా తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యవర్గంలో పాతబస్తీలోని అన్ని వర్గాల వారికి తగిన ప్రాధాన్యతకల్పిస్తామని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాలు పాతబస్తీలో ప్రభావం చూపుతున్నాయని ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణితో పాటు పలు పథకాలను పాతబస్తీలోని ప్రజలు డబ్బై శాతం వరకు లబ్దిపొందుతున్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్ పాతనగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా తెలియజేశారు.

## బోధన పరిశోధనలో కృత్రిమ మేధస్సుపై కార్యక్రమం


ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బోధన అభ్యాసం పై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న లెక్చరర్లు.

**బేగంపేట జనవరి 3, ప్రభాతవార్త** బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం, అంతర్గత నాణ్యత హామీ సెల్ సహకారంతో బోధన అభ్యాసం, పరిశోధనలో కృత్రిమ మేధస్సు అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌సిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ)ప్రొఫెసర్ డా. రామకృష్ణ యలమంచలి పాల్గొని బోధన, మూల్యాంకనం, పరిశోధన, నివేదిక రచన అకాడమిక్ కార్యకలాపాలలో ఏఐ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని డా. టి. అన్నీషెరాన్, (ఐక్యూఏసీ కోఆర్డినేటర్) ప్రొఫెసర్ డా. ఎం. జె. ఎలియట్, డా. డి. సరిత లు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పద్మావతి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బోధనా సిబ్బందికి వారి నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని వక్తలు పేర్కొన్నారు.

## రహదారుల మళ్లింపులను పర్యవేక్షించిన బానుక నర్మధ



**కంటోన్మెంట్, జనవరి 3 ప్రభాతవార్త:** ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాల దృష్ట్యా రహదారుల మళ్లింపుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేసిన రహదారులను రోడ్ల స్థితి గతులను శనివారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను మర మ్మత్తులు చేపట్టేందుకు ఎంపీ ఈటెల రాజేందర్ హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చించి రోడ్ల మరమ్మత్తులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్‌లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి



మల్కాజిగిరి జనవరి3, ప్రభాతవార్త : మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో మోలాలి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి నియోజకవర్గ మోలాలి సర్కిల్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ, రహదారి అభివృద్ధి తదితర అంశా లపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుం డా సమస్యలను వేగంగా పరిష్కరించాలని, అభివృద్ధి పనుల్లో అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే అధికా రులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు. డిప్యూటీ కమిష నర్ గోపాల్ రావు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనుల ను త్వరితగతిన పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యేకి తెలిపారు

## కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన కార్పొరేటర్



మల్కాజిగిరి జనవరి3, ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని న్యూ శ్రీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో మహిళల పిలుపుమేరకు కార్పొరేటర్ వైపు ప్రేమ్ కుమార్ కమ్యూనిటీ హాల్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు కుట్టు మిషన్లు కావాలని మహిళా భవనం ఏర్పాటు చేయాలని తెలపడం జరిగింది అనంతరం నూతన సంవత్సర కేకును కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎండి రషీద్ బక్క ఎబెల్, సునీత, లక్ష్మీ, సలోమి, సంపూర్ణ, కాంగ్రెస్ నాయకులు బాబు సత్యనారాయణ పాల్గొన్నారు

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి హరీష్ రావు



నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు, చిత్రంలో మలక్ పేట బిఆర్ఎస్ యువజన నాయకులు బుగుడాల కమల్ కిషోర్ తదితరులు

మలక్ పేట, జనవరి 3, ప్రభాతవార్త: మలక్ పేట బిఆర్ఎస్ యువజన నాయకుడు బుగుడాల కమల్ కిషోర్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని ఆరోపించారు. బుగుడాల కమల్ కిషోర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, చుక్క కృష్ణ, ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి



రోడ్డు భద్రత పై విజయ హై స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ డైరెక్టర్ లింగయ్య.

కుషాయిగూడ, జనవరి 3, ప్రభాతవార్త : విజయ హై స్కూల్లో శనివారం రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ భద్రత అవగాహన ర్యాలీ తెలంగాణా విద్యాశాఖ డైరెక్టర్ లింగయ్య , జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ ల సహకారంతో, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ అధికారుల సూచనలతో విజయవంతంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో విజయ హై స్కూల్‌కు చెందిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్లకార్డులు, చార్టులు ప్రదర్శిస్తూ రోడ్డు భద్రతకు సంబంధించిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాల పాటింపు, పాదచారుల భద్రత, రోడ్లపై బాధ్యతాయుత ప్రవర్తన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, ప్రిన్సిపల్ శ్రీ దేవినేని వెంగబాబు రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతపై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, అలాగే విద్యార్థులు సమాజంలో అవగాహన దూతలుగా మారాలన్నారు.

## ప్రతి పేద విద్యార్థి విద్యాపరంగా ఎదిగినప్పుడే అభివృద్ధి

కుషాయిగూడ, జనవరి 3, ప్రభాతవార్త

ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాలకు వెళ్లకుండా చదువు మధ్యలోనే మానేసి ఉన్న పేద విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్య అందిస్తున్నామని అభ్యుదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉమా పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ... ఉన్నత విద్యకు వెళ్లాలనుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పేదరికం శాపం కాకూడదని పేర్కొన్నారు. విద్య పట్ల ఆసక్తి పెరగడానికి కేవలం విద్యనే కాకుండా ప్రతిరోజు వివిధ రకాల క్రీడలను సైతం పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. స్వచ్ఛందంగా ఉచితంగా విద్యను అందిస్తున్న తమ పిల్లలకి ప్రభుత్వము స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా ఎదిగిన వారు సహకరించి పేద విద్యార్థుల నాదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ రకాల కలలను వెలికితీయడానికి ఆయా కళాత్మక పోటీలను నిర్వహించడంతోపాటు వాటికి అవసరమైన పరికరాలను అందజేస్తున్నామని కార్యదర్శ రాజు అన్నారు.

## విద్యతో మహిళా సాధికారత, సమానత్వం



హయత్ నగర్, జనవరి 3 ప్రభాతవార్త : విద్యతో మహిళల్లో సాధికారత సాధ్యమని సమానత్వం తీసుకు రావచ్చని హయత్ నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సురేష్ బాబు అన్నారు. సావిత్రి బాయి ఫూలే జయంతిని పురస్కరించుకుని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్స్ పై అవగాహసైబర్ క్రైమ్స్ పై విద్యార్థులు, ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని హయత్ నగర్ సీ.ఐ నాగరాజు గౌడ్, డీఐ సంతోష్ కుమార్ సూచించారు. సైబర్ క్రైమ్ జరగ్గానే 1930 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయడం ద్వారా గోల్డెన్ అవర్ లో ఫ్రాడ్ ను నియంత్రించ వచ్చన్నారు. ఆయా రకాల సైబర్ నేరాలను వివరించి వాటి నుండి ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు.

## అండాల్ నిలయంలో ఘనంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు : లక్ష్మీదేవి



శ్రీ అండాలయంలో ముత్తైదువులకు పసుపు, కుంకుమల అందజేస్తున్న నిర్వాహకులు రూపాదేవి తదితరులు

మలక్ పేట, జనవరి 3, ప్రభాతవార్త: ముసారాంబాగ్‌లోని శ్రీ అండళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఉందుమద గళిత్త పాశురం పై ప్రవచనము కార్యక్రమాన్ని నిర్వహించారు. సౌభాగ్యవతులైన శ్రీ అండాళ్ నిలయం భక్తులకు శ్రీ ఆండాళ్ నిలయం నిర్వాహకులు రూపాదేవి తదితరులు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా తిరుప్పావై ఒక ప్రత్యేక నేపద్య కచేరి జరిగింది. ఈ సందర్భంగా నిర్వహకులు లక్ష్మీదేవి, రూపా దేవి లు మాట్లాడుతూ డిసెంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభం అయినా ధనుర్మాస ఉత్సవాలను జనవరి 14వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధనుర్మాస ఉత్సాలలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీ మాన్ ధరూరి రామానుజాచార్య స్వామి వారితో ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. జనవరి 5వ తేదీ సోమవారం ఖీఏట్రాకలంగల్ఖీ పాశురం, మాతృశ్రీ రిందా దేవి తిరునక్షత్రం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం, రాత్రి 7:30 గంటలకు రిందా శరణ్యా నాట్యమండలి శ్రీమతి యశోద వారి బృందం నాట్య ప్రదర్శన, 8వ తేదీ గురువారం అండాళ్ నిలయంలో దీపోత్సవం, స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనం, మంగళ శాసనం, 11వ తేదీ ఆదివారం ఉదయం అండాళ్ తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108 గంగాలములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన వితరణ కార్యక్రమం, 14వ తేదీ బుధవారం భోగి పండుగ, గోదా కళ్యాణం, సాయంత్రం తిరుప్పావై ఫల శృతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## నిబంధనలు ఉల్లంగించి చేస్తున్న వెంచర్ పై చర్యలు తీసుకోవాలి

హయత్ నగర్, జనవరి 3 ప్రభాతవార్త : పెద్ద అంబర్‌పేట సర్వే నంబర్లు103 నుండి 159పి లలో ప్రైవేట్ డెవలపర్లు నిబంధనలను ఉల్లంగించి చేస్తున్న భారీ వెంచర్‌పై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అడ్వకెట్ పిల్లి శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. లే అవుట్ కుంభకోణం, నాలా, నక్షబాట కబ్జాపై ముఖ్యమంత్రికి, హైడ్రా అధికారులు, హెచ్‌ఎండీఏ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంచర్ ఏర్పాటుతో ప్రభుత్వ ఆస్తులకు, పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతోందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం ఒక ఎకరాకు గరిష్టంగా 2750 చదరపు గజాల ప్లాట్ ఏరియా మాత్రమే ఉండాలి. డెవలపర్లు తప్పుడు లెక్కలతో 2950 చదరపు గజాలు చూపిస్తూ, పబ్లిక్ యుటిలిటీ కోసం వదలాల్సిన ఖాళీ స్థలాన్ని అక్రమంగా కాజేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా ఉన్న సహజ సిద్ధమైన నాలాను పూడ్చివేసి దానిపై సెప్టిక్ ట్యాంక్ నిర్మించారన్నారు. ఎ1 బేకరీ నుండి బ్యాంక్ కాలనీకి వెళ్లే నక్షబాటను ఆక్రమించడంతో రోడ్డు వెడల్పు తగ్గిందన్నారు. ఈ అక్రమాలపై స్థానిక డిసి రవీందర్ రెడ్డి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, డెవలపర్లతో కుమ్మక్కై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా కబ్జా వల్ల వర్షాకాలంలో చుట్టుపక్కల ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

తక్షణమే హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. విజిలెన్స్ విభాగం ద్వారా సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఓట్ల చోరీకి పాల్పడే కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చారు

**-జిహెచ్ఎంసి ఎన్నికల్లో ప్రజలు బొంద పెట్టాలి**

**-రాష్ట్ర బిజెపి నేత శంకర్‌రెడ్డి పిలుపు**



కాంగ్రెస్, బిఆర్ఎస్‌లను ఎండగడుతున్న కొలన్ శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త: గడచిన పది సంవత్సరాలలో మహేశ్వరం నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో ఓటు చోరీకి పాల్పడే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు అధికారంలోకి వచ్చాయని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి ఆరోపించారు. ఈ సారి కూడా ఆయా పార్టీలకు చెందిన వారు జిహెచ్ఎంసిలో విలీనమైన కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కొత్తగా ఏర్పాటైన డివిజన్లలో జరగబోయే ఎన్నికల్లో గెలవాలని పగటి కలలు కంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అయితే దొంగ ఓట్లతో, డబ్బులు, మద్యం పంపిణీ చేసి అధికారంలోకి రావాలనే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లను ప్రజలు బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్‌రెడ్డి కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఎన్నికల్లో చేసే అరాచకాలను తూర్పారబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎను ఓడించే సత్తాలేని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ గగ్గోలు పెడుతూ ఎక్కడా నిరూపించకుండానే ప్రధాని మోడీపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తుంటే మహేశ్వరం నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ వారే గత పదేళ్లుగా దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని అన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి మారే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు చెందిన వారు దొంగ ఓట్ల పునాదులపై కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు అయ్యారని ఆయన ఆరోపించారు. దిగజారుడు రాజకీయాలు చేస్తూ రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండా చేశారని ఆయన విమర్శించారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కూడా దొంగ ఓట్లు, మద్యం, డబ్బులతో గెలవాలని కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పగటి కలలు కంటున్నారని ఆయన అన్నారు. ఊసరవెల్లిలా మారే వారిని ప్రజలు ఓటు అనే వజ్రాయుధంతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు కొనుగోలుకు వచ్చే వారిని ఈ ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని శంకర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిజెపి ఓబిసి మోర్చా నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, పార్టీ నాయకుడు జె.శ్రీనవాసచారి పాల్గొన్నారు.

## సంక్రాంతి వేళ అప్రమత్తతే భద్రత

**కాలనీల్లో మహిళలకు మహిళా పోలీసుల అవగాహన**



నేరేడ్ మెట్, జనవరి 3, ప్రభాతవార్త : రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలకు, ఊర్లకు వెళ్లే కుటుంబాలు దొంగతనాలకు గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నేరేడ్‌మెట్ మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు ప్రజలకు సూచించారు. నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో వినూత్న విధానంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు సైకిళ్లపై కాలనీలకు చేరుకొని, ముఖ్యంగా మహిళలను సమీకరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇళ్లకు తాళాలు వేసే విధానం, విలువైన వస్తువులు ఒంటరిగా ఉంచకూడదని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరించారు. పండుగల సమయంలో ఖాళీ ఇళ్లే లక్ష్యంగా దొంగలు తిరుగుతుంటారని, అందువల్ల పొరుగువారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సంక్రాంతి నేపథ్యంలో ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని నేరేడ్‌మెట్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి నేర రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎల్.బి.నగర్, జనవరి 3 ప్రభాతవార్త: పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్‌గుప్త పేర్కొన్నారు. మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సాధుపాయాల కల్పనలో భాగంగా కొత్త బోర్‌వెల్‌కి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతు ప్రభుత్వ స్కూల్ విధ్యార్థులను ప్రోత్సాహిస్తే అన్నీ రంగాల్లో విజయాలు సాధిస్తారన్నారు. ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలు అన్నీ హంగులతో తీర్చిదిద్ది ఉత్తమ విద్యాబోధన చేస్తున్నామన్నారు. స్కూల్ హెడ్‌మాస్టర్ కట్టా ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్, పాఠశాల కమిటి మాజీ చైర్మన్ చుక్కయ్య, శ్వేతారెడ్డి, దినేష్‌సింగ్, సామలేటి సాయిరాం, లింగాల భాషాగౌడ్, జహగీర్‌బాబాగౌడ్, రమేష్‌గౌడ్, కొమ్ము యాదగిరి, విక్రమ్‌సింగ్, ఉపాధ్యాయులు సునీత, అరుణ జ్యోతి, అంజనాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ మండల గ్రామ పాలనాధికారుల సంఘం ఎన్నిక



బాలాపూర్ ఎమ్మార్వో ఇందిరాదేవిని కలిసిన మండల గ్రామ పాలన అధికారుల సంఘం కార్యవర్గం

సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త: బాలాపూర్ మండల గ్రామ పాలన అధికారుల సంఘం నూతన అధ్యక్షునిగా బుట్టి సుదర్శన్, ఉపాధ్యక్షునిగా బాచరాజు వెంకట శేషారావు, ప్రధాన కార్యదర్శిగా జి.సత్యనారాయణ, కోశాధికారులుగా పి.మనీష, ఎ.రాధ, కార్యవర్గ సభ్యులుగా ఆనంద్, ప్రసాద్, శివకుమార్, లక్ష్మయ్య, రమేష్, మల్లికార్జున్, బాబూరావు, మునిరాజ్, సుధాకర్, శ్రావణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం నూతన కార్యవర్గం బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో ఇందిరా దేవితో పాటు డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం వారు ఎమ్మార్వో, డిప్యూటీ ఎమ్మార్వోలను సన్మానించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఎమ్మార్వో, డిప్యూటీ ఎమ్మార్వోలు గ్రామ పాలన అధికారుల సంఘానికి నియమితులైన వారికి అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్ళాలి: కెఎల్ఆర్



కెఎల్ఆర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన బాల్‌నింగని జంగయ్య తదితరులు

సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త: ఈ కొత్త సంవత్సరంలో మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకుపోవాలని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నాయకులకు సూచించారు. శనివారం బాలాపూర్ గ్రామానికి చెందిన కాంటెస్టెడ్ కార్పొరేటర్, టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య పలువురితో కలిసి తుక్కుగూడలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కెఎల్ఆర్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కెఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ప్రచారం చేయాలని అన్నారు. పార్టీ శ్రేణులందరికీ అండగా ఉంటానని నియోజకవర్గంలో పార్టీకి వైభవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ కమిటీ కో-ఆర్డినేటర్ లక్ష్మీశెట్టి మనోహర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదదర్శి తొట్ల భానుప్రసాద్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధనుర్మాస వైభవం.. వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం ఘనోత్సవం



నేరేడ్ మెట్, జనవరి 3, ప్రభాతవార్త : వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజూ నారాయణ యాగం, తిరుప్పావై సేవలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో 18వ రోజు నారాయణ యాగం, తిరుప్పావడ సేవలో భాగంగా నిర్వహించిన అన్నకూటోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. పులిహోర, పండ్లు, స్వీట్లతో వేంకటేశ్వరస్వామి వారి రూపాన్ని అలంకరించి, వేద పండితుల ఆధ్వర్యంలో ఘన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు ధనుర్మాసం మహత్తు, తిరుప్పావడ సేవ (అన్నకూటోత్సవం) విశిష్టతను భక్తులకు వివరించారు. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చైర్మన్ గుబ్బా మహేష్, ప్రాజెక్ట్ చైర్మన్ గుంత సాంబమూర్తి, వైస్ చైర్మన్ తుమ్మనపల్లి జగదీశ్వర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇల్లెందుల సంతోష్, ప్రధాన కార్యదర్శి యంసాని శ్రీనివాస్, కోశాధికారి అత్తెల్లి ప్రవీణ్ మాట్లాడుతూ ధనుర్మాసంలో ప్రతిరోజూ నారాయణ యాగం, తిరుప్పావై సేవలతో పాటు జనవరి 7న సంగీతగాన నివేదన, జనవరి 8న 108 దీపాలతో మంగళహారతులు, జనవరి 11న 108 గంగాలతో పాయసం నివేదన, జనవరి 12న మహా పూర్ణాహుతి, జనవరి 14న గోదా రంగనాథ స్వామి కల్యాణం మరియు వివాహం కానివారి కోసం వారణ మాయిరాం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపాశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు : ఆర్టిఓ





ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీవో లెక్కల కిష్టయ్య తదితరులు

మలక్ పేట ,జనవరి 3, ప్రభాతవార్త: వాహనదారులకు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలని పురస్కరించుకొని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య ఆధ్వర్యంలో మలక్ పేట్ బి బ్లాక్ లో ద్విచక్ర వాహనదారులకు నిర్వహించిన హెల్మెట్ ర్యాలీని ఆర్టీవో లెక్కల కిష్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నియమ, నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టులు ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని కోరారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని విస్తృతంగా ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు పలు ప్రాంతాలలో ర్యాలీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ లు నరేంద్ర పాల్ సింగ్, రాధిక బలరాం, ఏఎంవి ఐ లు జాన్, మధుసూదన్ రెడ్డి, రజిని, అశ్రఫ్ ఖాన్, హర్షిత తదితరులు పాల్గొన్నారు

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోమాతకు పూజలు



గోమాతకు నమస్కరిస్తున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. జనవరి. 3. ప్రభాతవార్త. బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ జనార్ధనా నంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 11వ స్మార్త విద్వత్సభలు రాజతోత్సవముల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హాజరైయ్యారు. కార్యక్రమానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్త విద్వత్సభలు హిందూ ధర్మంలోని స్మార్త సంప్రదాయానికి చెందిన విశిష్ట సమావేశాలని తెలిపారు. పండితులు, భక్తులు జ్ఞానాన్ని పంచుకోవడంతో పాటు సంప్రదాయాలను కాపాడేందుకు ఈ సభలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శూలపాణి, ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు బసవయ్య, ప్రధాన కార్యదర్శి నరసరాజు, మంగపతి రావు, మూర్తి, బాబురావు, బాల్ రెడ్డి, శ్రీధర్, సుధీర్, రాజేందర్ రెడ్డి, మరియు తదితరులు ఉన్నారు.

## అన్ని కాలనీలకు కనీస సదుపాయాలు కల్పిస్తాం



హయత్ నగర్, జనవరి 3 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో కనీస మౌలిక సదుపా యాలను కల్పిం చడమే ధ్యేయంగా పనిచేస్తు న్నామని మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. హయత్ నగర్ ప్రాంతంలోని ఆదిత్య నగర్లో 13.8 లక్షల రూపాయలతో పూర్తి చేసిన సీసీ రోడ్డు పనులను ఆయన కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు, కాలనీ ప్రతినిధుల సహకారంతో బొమ్మల గుడి ప్రాంతంలో దాదాపు అన్ని కాలనీలలో సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఆదిత్య నగర్ కాలనీ, పవనగిరి కాలనీ ఫేస్ 3, టినగర్ కాలనీ, విష్ణునగర్ లలో వంద శాతం మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. నెల రోజులలో 1015 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేయబోతున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కృష్ణ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, రమేష్, రాజేంద్ర ప్రసాద్, బలరాం, శంకర్ పాల్గొన్నారు.

## ఆదిభట్ల సర్కిల్ సేవలు రాగన్నగూడ వార్డు కార్యాలయం నుంచే





తుర్కయంజాల్ జనవరి3, ప్రభాతవార్త జీహెచ్ఎంసీ. కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఆదిబట్ల సర్కిల్ 15 కార్యాలయాన్ని సాగర్ రహదారి రాగన్నగూడ వార్డు కార్యాలయం తరలించినట్లు సర్కిల్ డిసీ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కన్నన్ ఆదేశాలు మేరకు ఆదిబట్ల కార్యాలయాన్ని రాగన్నగూడ వార్డు కార్యాలయానికి మార్చినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న నాలుగు వార్డులు తుర్కయంజాల్, తొర్రూర్, కొంగర కలాన్, ఆదిభట్ల ప్రజలకు రాగన్నగూడ కార్యాలయం నుండే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ ప్రజలు అందరు గమనించాలని కోరారు. కార్యక్రమంలో డిఈ బిక్షపతి, ఇంచార్జ్ ఎఎంసీ శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాంత్ యాదవ్



బోడుప్పల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త ; మేడ్చల్ ఎమ్మెల్యే ,మాజీ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డిని వారి నివాసమందు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బింగి శ్రీకాంత్ యాదవ్ ఒకటవ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ గండు అంజి యాదవ్ ,సాయి కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కరణ్‌బాగ్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లో రూ.15.20 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించి, వాటి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అప్సింగికర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో రూ.74 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.6.23లక్షల వ్యయంతో ఫుట్ పాత్ పనులకు, రూ. 4.86లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని, సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ కాలనీవాసులు కెఆర్‌సి రెడ్డి, సర్వేశ్వర్ రావు, వెంకటరమణ, శర్మ, దేవేందర్‌రెడ్డి, ఉమాపతి రెడ్డి, యాదగిరిరెడ్డి, రేణుక, పావని, మల్లిక, మాధవి పాల్గొన్నారు.

## గ్రేటర్ కమిషనర్‌తో పరమేశ్వర్‌రెడ్డి భేటీ



ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తో శనివారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్‌ను కలిసి నూతన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని విన్నవించారు. ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను కేటాయించాలని కోరారు . పెండింగ్‌లో ఉన్న పనులను సైతం పూర్తి చేసేందుకు కూడా కావాల్సిన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖరరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లింగాల బాబయ్యగౌడ్‌కు ఘన నివాళి



ఎల్.బి.నగర్, జనవరి 3 ప్రభాతవార్త: మాజీ సర్పంచి లింగాల బాబయ్యగౌడ్ 18వ వర్ధంతి కార్యక్రమం శనివారం కొత్తపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబయ్య కుటుంబ సభ్యులందరూ కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లింగాల బాబయ్యగౌడ్ విగ్రహం వద్ద లింగాల రాహుల్‌గౌడ్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కుటుంబ సభ్యులందరూ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు మాట్లాడుతూ లింగాల బాబయ్యగౌడ్ చూపిన రాజకీయ విలువలు, నిజాయితీ, సేవాభావం రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు లింగాల నాగేశ్వరరావు, లింగాల వెంకటేశ్వర్‌గౌడ్, లింగాల నరేందర్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, అంజన్ కుమార్‌గౌడ్, లింగాల కిషోర్‌గౌడ్ శ్రీకాంత్, అక్షయ్‌గౌడ్, విశ్వేశ్వర్, గోపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.